

Dr.G.Rajesh

CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ:, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 76 ఎడిటర్ : జి.రాజేష్ శుక్రవారం 12 జూన్ 2026 పేజీలు : 6 వెల రూ. 4.00

# పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం

మిగతా 2లో

**కొత్తగా పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ**

**విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్**

**వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర 2047' నీతి ఆయోగ్ భేటీలో సిఎం చంద్రబాబు వెల్లడి**



**ప్రతి కుటుంబానికి ఇళ్లు, తాగునీరు, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ సహా 7 ప్రాథమిక అవసరాలు కల్పించడమే ఏపీ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న 10శాతం మంది.. వెనుకబడిన 20శాతం మందిని ఆదుకునేలా వినూత్న కార్యక్రమం తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు.**

న్యూఢిల్లీ,ఐఎన్‌బిటైమ్స్

పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని అలాగే ఏపీలో కొత్త పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకువస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తామని పేర్కొన్నారు. ఢిల్లీలో గురువారం నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర 2047' ప్రతిష్ఠాత్మక విజన్ ప్లాన్‌ను సమర్పించారు. పేదరిక నిర్మూలన, భారీస్థాయిలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి లక్ష్యాలుగా స్వర్ణాంధ్ర రోడ్‌మ్యాప్ ప్రకటించారు. గడిచిన రెండేళ్లలో ఏపీ పారదర్శక విధానాల వల్ల రూ. 23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులని ఆకర్షించామని వెల్లడించారు.

# డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాల్సిందే

## అన్యాయన్ని ప్రశ్నించే వారంతా కాక్రోచ్‌లే

## మయరోమారు విమర్శలు గుప్పించిన జగన్

అమరావతి,ఐఎన్‌బిటైమ్స్

డీఎస్సీ నియామకాల అంశంపై మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మరోసారి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. డీఎస్సీ అభ్యర్థులు యువత భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని, వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల యువత నష్టపోతే ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. జగన్ మాట్లాడుతూ.. 'ఎవరైనా మమ్మల్ని కాక్రోచ్ పార్టీ అని పిలుస్తారా లేదా అనేది పక్కన పెడితే.. డీఎస్సీ అభ్యర్థులు



మిగతా 2లో

# ఎపిలో నేటినుంచిబడిగంటలు


- శుక్రవారం నుంచి స్కూళ్లు పున:ప్రారంభం
- రెండు నెలల విరామం తరవాత తెరుచుకుంటున్న స్కూళ్లు
- పరీక్షల షెడ్యూల్‌ను సైతం విద్యాశాఖక్యాలెండర్‌ను విడుదల



2లో

# ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లలో గణనీయమైన పురోగతి

- మార్కెట్‌లో పొగాకుకు మెరుగైన ఆదరణ
- జూన్ 11 నాటికి టొబాకో బోర్డు ఆధ్వర్యంలోని వేలం వేదికల ద్వారా మార్కెటింగ్ ప్రక్రియ
- మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి,ఐఎన్‌బిటైమ్స్

ఆంధ్రప్రదేశ్‌లో ఎఫ్‌సీవీ పొగాకు వేలం ప్రక్రియ గత పది రోజులుగా మెరుగుదల సంకేతాలను చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కొనుగోలుదారుల భాగస్వామ్యం పెరగడం, మార్కెట్‌లో లిక్విడిటీ మెరుగుపడడం, వేలం కేంద్రాల్లో తిరస్కరణలు గణనీయంగా

- మిగతా 2లో

# భవిష్యత్ వైద్య విధానాల్లో 'క్వాంటం బయాలజీ' కీలకం

- వైద్య విద్యా ప్రణాళికలో క్వాంటం బయాలజీని చేర్చేలా ఎన్ఎంసీకి ప్రతిపాదనలు
- డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సుల రూపకల్పనపై దృష్టి
- డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ పులాల చంద్రశేఖర్



అమరావతి, ఐఎన్‌బిటైమ్స్

వైద్య పరిశోధనలు, చికిత్సా విధానాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా రాబోయే రోజుల్లో 'క్వాంటం బయాలజీ' కీలకపాత్ర పోషించనుందని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పులాల చంద్రశేఖర్ స్పష్టం చేశారు. క్వాంటం బయాలజీ



# అద్దె భవనాలకు ఇక స్వస్తి

- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు
- ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

మిగతా 2లో

# గురుకుల విద్యలో మరో విప్లవాత్మక అడుగు



- అణగారిన వర్గాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యే లక్ష్యం
- డిగ్రీ కళాశాలలకు యూజీసీ స్కేలు కొత్త కోర్సులు, 9 కొత్త సీఓఈలు,
- ల్యాప్‌టాప్‌లు, ఆర్థిక సాయం టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ మూడో
- బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో కీలక నిర్ణయాలు
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

# పారదర్శకంగానే డీఎస్సీ నిర్వహణ

- పలుమార్లు వివరణ ఇచ్చాం
- ఆన్‌లైన్‌లో విరాలు పెట్టినా పదేపదే విమర్శలు
- మరోమారు మీడియాతో కోనశశిధర్ వెల్లడి



2లో

# గురుకుల విద్యలో మరో విప్లవాత్మక అడుగు



హైదరాబాద్,జూన్1 సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన, ప్రపంచ స్థాయి విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను సామాజిక మార్పుకు ప్రధాన ఆయుధంగా భావిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్డబ్ల్యూఆ ర్ఈఐఎస్) మూడవ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశం గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ విద్య, ఉపాధ్యాయ సంక్షేమం, ఉన్నత విద్య అవకాశాల విస్తరణకు సంబంధించి పలు కీలక నిర్ణయాలను బోర్డు ఆమోదించింది. డిగ్రీ కళాశాలల నిర్వహణ కోసం ప్రత్యేక పరిపాలనా విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు యూజీసీ వేతన స్కేలు అమలుపై సానుకూల నిర్ణయం. తీసుకున్నారు. డిగ్రీ కళాశాలలకు న్యాక్ గుర్తింపు సాధించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు. ఉన్నత విద్య కోసం దేశ, విదేశీ విశ్వవిద్యాలయాలకు వెళ్లే ఎస్సీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఆర్థిక సహాయం అందించేందుకు ఆమోదం లభించింది. 9వ తరగతి నుంచే నీట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు మరో 9 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభించాలని నిర్ణయం. క్రాఫ్ట్ టీచర్లు, ఆర్ట్ టీచర్లను టీజీటీలుగా గుర్తించే ప్రతిపాదనకు ఆమోదం. సెలవు రోజుల్లో విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడేందుకు 'ఫోన్ మిత్ర' సౌకర్యం ఏర్పాటు చేయాలని నిర్ణయం. రాష్ట్ర కార్యాలయంలో భర్తీ చేసే పోస్టులకు రోస్టర్ విధానం అమలు చేయాలని తీర్మానం. భవిష్యత్ ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని డిగ్రీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయం. హైదరాబాద్‌లో టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ ఆధ్వర్యంలో ఫార్మసీ కళాశాల స్థాపనకు సూత్రప్రాయ ఆమోదం. గురుకుల విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగు పరిచేందుకు ఫౌండేషన్ సెంటర్లను బలోపేతం చేయడం, అదనపు సబ్జెక్ట్ నిపుణులను నియమి ంచడం. క్రీడలు, వొకేషనల్ లెక్చరర్ల సేవలను కొనసాగించడం.డిగ్రీ విద్యార్థుల్లో విద్యా ఏకాగ్రత పెంపు కోసం మొబైల్ ఫోన్ వినియోగంపై అమలులో ఉన్న నిబంధనలను కొనసాగించడం. విద్యార్థులకు అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించాలనే ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనమని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా విద్య ద్వారానే సామాజిక సాధికారత సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

# పారదర్శకంగానే డీఎస్సీ నిర్వహణ

అమరావతి,జూన్11 డీఎస్సీపై రెండుసార్లు సమగ్ర వివరణ ఇచ్చినా నిరాధార ఆరోపణలే మళ్లీ మళ్లీ వస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. అక్టోబర్‌లో జాబ్ క్యాలెండర్‌లో భాగంగా మళ్లీ డీఎస్సీ నోటిఫికేషన్ వస్తోందని చెప్పుకొచ్చారు. దీనిపై ఎవరికీ ఎలాంటి అపోహలు వద్దని అన్నారు. గురువారం కోన శశిధర్ మీడియాతో మాట్లాడారు. లీక్‌కు ఎలాంటి స్కోప్ లేకుండా డీఎస్సీ నిర్వహించామని స్పష్టం చేశారు. హారిజాంటల్ రిజర్వేషన్ అర్థం చేసుకోని వాళ్లే అనవసర విమర్శలు చేస్తున్నారని చెప్పారు. కాల్ లెటర్ వచ్చినంత మాత్రాన ఉద్యోగం వచ్చినట్లు కాదని నోటిఫికేషన్‌లోనే స్పష్టం చేశామని అన్నారు. సర్టిఫికేట్ ధ్రువీకరణ కోసమే కాల్ లెటర్‌లు పంపిస్తామని వివరించారు.ఎక్కడైనా సెలెక్షన్ లిస్ట్ ఉంటుంది తప్ప రిజెక్షన్ లిస్ట్ ఉండదని చెప్పుకొచ్చారు. ఇంకో డీఎస్సీ కూడా వస్తున్నందున అభ్యర్థులు ఈ విధానాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా ఇంకా అనుమానాలు ఉంటే కమిషనర్ కార్యాలయంలో సమాచారం కోసం అందుబాటులో ఫోన్‌నంబర్ ఉందని, అందరి అనుమానాలు నివృత్తి అవుతాయని కోన శశిధర్ పేర్కొన్నారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా విధానంపై ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు

. డీఎస్సీలో క్రీడా కోటా పారదర్శకంగా అమలు చేశామనటానికి అన్నీ ఆన్‌లైన్‌లో ఉంచామని స్పష్టం చేశారు. ఇప్పుడున్న ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే పకడ్బందీగా డీఎస్సీ పరీక్ష నిర్వహించామని తేల్చిచెప్పారు

. 2019లో ఇంటర్ కాలేజ్ రిక్రూట్‌మెంట్ జరిగిందని, కానీ ఇప్పుడలా చేయలేదని వివరించారు. ఇంటర్ డిస్ట్రిక్ట్, స్టేట్, ఇంటర్నేషనల్, ఒలింపిక్స్ వరకు సర్టిఫికెట్లు స్పోర్ట్స్ కోటాలో చూశామని వెల్లడించారు. నిబంధనల ప్రకారం ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయని వారికి ఉద్యోగం రాలేదని అన్నారు. అలాంటి వారు కొందరు కోర్టుకు వెళ్లారని, కోర్టు ఇచ్చే ఆదేశాల ప్రకారం ప్రభుత్వం నడుచుకుంటుందని అజయ్ జైన్ స్పష్టం చేశారు.

## ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లలో
# గణనీయమైన పురోగతి

తగ్గడం సానుకూల పరిణామాలని ఆయన పేర్కొన్నారు. పొగాకు కొనుగోళ్ల పరిస్థితిపై గురువారం సహచర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, ఆనం రామనారాయణరెడ్డి, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, అలాగే పొగాకు పండించే జిల్లాల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. జూన్ 11 నాటికి టొబాకో బోర్డు ఆధ్వర్యంలోని వేలం వేదికల ద్వారా మొత్తం 15.65 మిలియన్ కిలోగ్రాముల ఎఫ్‌సీవీ పొగాకు మార్కెటింగ్ జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని 16 వేలం కేంద్రాలకు ప్రస్తుతం రోజుకు సుమారు 8,000 బేళ్ల పొగాకు వస్తుండటంతో మార్కెటింగ్ ప్రక్రియ సజావుగా సాగడమే కాకుండా కొనుగోలుదారుల పాల్గొనడం కూడా మెరుగుపడిందన్నారు. ఇటీవలి కాలంలో అత్యంత ముఖ్యమైన పరిణామం తిరస్కరణలు, నో బిడ్ స్థాయిలు గణనీయంగా తగ్గడమేనని మంత్రి తెలిపారు. గతంలో 30 నుంచి 37 శాతం మధ్య ఉన్న తిరస్కరణల శాతం ప్రస్తుతం సుమారు 20 శాతానికి తగ్గిందని చెప్పారు. ఇది మార్కెట్‌లో పొగాకుకు మెరుగైన ఆదరణ లభిస్తోందనే విషయాన్ని సూచిస్తోందని, అలాగే వ్యాపార అవసరాలకు అనుగుణంగా పొగాకు సరఫరా జరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం నెలకొన్న మార్కెట్ పరిస్థితులపై సమగ్ర అవగాహన కోసం టొబాకో బోర్డు అన్ని వర్గాల భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 8న వ్యాపార వర్గాలు, ఎగుమతిదారులు, కొనుగోలుదారులు, రైతు ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకుని మార్కెట్‌లో లిక్విడిటీ పెంచేందుకు ఆచరణాత్మక వ్యూహాలపై చర్చించామని తెలిపారు. ఈ సమావేశాల్లో కొనుగోలుదారులు, వ్యాపార వర్గాలు అన్ని గ్రేడ్ల పొగాకును సమతుల్యంగా వేలానికి తీసుకువస్తే దేశీయ, ఎగుమతి మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా కొనుగోళ్లు మరింత పెంచే అవకాశం ఉంటుందని వెల్లడించారని చెప్పారు. మరోవైపు రైతులు కూడా తిరస్కరణలు తగ్గించి కొనుగోళ్లు నిరంతరాయంగా కొనసాగితే అన్ని గ్రేడ్ల పొగాకును మార్కెట్‌కు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారని వివరించారు. సమావేశాల్లో అన్ని వర్గాల మధ్య సమతుల్య గ్రేడ్ల సరఫరా, కొనుగోలుదారుల భాగస్వామ్యాన్ని పెంచడం, వేలం కేంద్రాలకు నియంత్రిత స్థాయిలో పొగాకు రాకలు ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరంపై విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తమైందన్నారు. ఈ నేపథ్యంలో టొబాకో బోర్డు అన్ని కొనుగోలు సంస్థలతో సమన్వయం చేస్తూ వారానికి కొనుగోలు లక్ష్యాలను నిర్దేశించి, పంటను క్రమబద్ధంగా మార్కెటింగ్ చేయడంతో పాటు రైతుల వద్ద ఉన్న పొగాకు నిల్వలను వేగంగా విక్రయించే దిశగా చర్యలు చేపడుతోందన్నారు. దాదాపు పది రోజుల క్రితం ఉన్న పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుతం కొనుగోలు సంస్థలు తమ భాగస్వామ్యాన్ని గణనీయంగా పెంచి మరింత చురుకుగా పొగాకు కొనుగోళ్లు చేపడుతున్నాయని మంత్రి తెలిపారు. దీనివల్ల మార్కెట్‌లో సానుకూల వాతావరణం ఏర్పడి కొనుగోళ్లకు ఊపు వచ్చిందన్నారు. పొగాకు రైతుల ప్రయోజనాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, టొబాకో బోర్డు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నాయని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం

ఆర్టీజీఎస్ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 'అవేర్' వంటి ప్రిడిక్టివ్ టూల్స్‌తో ఏపీలో సాంకేతిక పాలన కొనసాగిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. పెట్టుబడుల కోసం రాష్ట్రాల మధ్య అనారోగ్యకర పోటీ వద్దని సూచించారు. మౌలిక వసతులు, స్థిరమైన విధానాలపై దృష్టి పెట్టాలని ఆయా రాష్ట్రాలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబానికి ఇళ్లు, తాగునీరు, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ సహా 7 ప్రాథమిక అవసరాలు కల్పించడమే ఏపీ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న 10శాతం మంది.. వెనుకబడిన 20శాతం మందిని ఆదుకునేలా వినూత్న కార్యక్రమం తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఏపీలో నివారణ ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ హెల్త్ రికార్డుల కోసం 'ప్రాజెక్ట్ సంజీవని' అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేసేలా ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తున్నట్లు వివరించారు. ఏపీలో సంతానోత్పత్తి రేటు 1.5శాతం కంటే తగ్గడంపై సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మానవ వనరుల కొరత, వృద్ధాప్య సమస్యలను అధిగమించేందుకు ఏపీలో కొత్త 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకువస్తామని వివరించారు. వికసిత్ భారత్ 2047 సాధన కోసం కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# డిఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాల్సిందే

యువకులు. వారి భవిష్యత్తు, వారి ఉద్యోగ అవకాశాల గురించి మాట్లాడుతున్నాం. వారికి న్యాయం చేయకపోతే ప్రభుత్వం తన బాధ్యతను ఎలా నిర్వర్తించినట్లు అవుతుంది' అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని వైఎస్ జగన్ అన్నారు. యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ హక్కుల కోసం గళమెత్తడం సహజమని పేర్కొన్నారు. ప్రస్తుతం తరచూ ప్రస్తావనలోకి వస్తున్న 'జెన్ జీ' యువత కూడా ఈ వ్యవస్థలో భాగమేనని.. వారి ఆశయాలు, ఆకాంక్షలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని వ్యాఖ్యానించారు. 'యువత కలలను, ఆశలను నలిపేస్తే కోట్లాది మంది ప్రజలు ఒకేసారి బయటకు వస్తారు. వారిని ఎవరైనా కాక్రోచ్‌లు అని పిలిస్తే, న్యాయం కోసం పోరాడే వారందరూ కాక్రోచ్‌లే అవుతారు. అలాంటి పోరాటంలో నేను కూడా వారిలో ఒకడిని' అని జగన్ అన్నారు. డీఎస్సీ అభ్యర్థుల సమస్యలపై తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని, యువతకు అన్యాయం జరిగితే మౌనంగా ఉండబోమని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి అభ్యర్థుల సందేహాలకు సమాధానాలు ఇవ్వాలని, వారి భవిష్యత్తుతో ఆటలాడకూడదని సూచించారు. డీఎస్సీ అవకతవకలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ర్యాలీలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దగా పడ్డ ప్రతి వర్గాన్ని కలుపుకుని ఉద్యమాన్ని మరింత బలంగా కొనసాగిస్తామని జగన్ స్పష్టం చేశారు. ప్రస్తుతం డీఎస్సీ నియామకాలపై రాష్ట్రంలో కొనసాగుతున్న వివాదాల నేపథ్యంలో మాజీ సీఎం జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

# భవిష్యత్ వైద్య విధానాల్లో 'క్వాంటం బయాలజీ' కీలకం

అనేది వైద్యం, రోగ నిర్ధారణ, బయోమెడికల్ పరిశోధనలలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగల అభివృద్ధి చెందుతున్న రంగమని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గురువారం క్వాంటం బయాలజీ – అణువుల నుండి వైద్యం వరకు అనే అంశంపై వెబెక్స్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఈ వెబ్ నార్ సెమినార్‌ను నిర్వహించారు. క్వాంటం బయాలజీకి సంబంధించిన డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులను త్వరలో ప్రవేశపెట్టవలసిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే ఆరోగ్య సంరక్షణ విద్యను ప్రోత్సహించడానికి గాను, దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో క్వాంటం బయాలజీ విద్య, శిక్షణా మాడ్యూళ్లను పాఠ్యాంశాల్లో చేర్చేలా జాతీయ వైద్య కమిషన్ కు విశ్వవిద్యాలయం తరపున ప్రతిపాదనలు పంపుతామని ఆయన వెల్లడించారు. క్వాంటం సాంకేతికతతో ఆరోగ్య వ్యవస్థల బలోపేతం పై ముఖ్యమంత్రి కార్యదర్శి పి.ఎస్. ప్రద్యుమ్న ఈ సెమినార్‌కు ఆన్‌లైన్ ద్వారా హాజరై ఆరోగ్య సంరక్షణ, పరిశోధన, ఆవిష్కరణల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో క్వాంటం సాంకేతికతల ప్రాముఖ్యతను గురించి వివరించారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థలలో క్వాంటం సైన్స్‌ను ప్రోత్సహించడానికి ప్రభుత్వ పరంగా చేపడుతున్న చర్యలను ఆయన వివరించారు.

# అద్దె భవనాలకు ఇక స్వస్తి

దరాబాద్,జూన్11(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్ మరియు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ భవనాలను హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రిగారు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవిన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్/ రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అ÷-దదె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిథిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు. ప్రభుత్వ కార్యాలయాలు అ÷-దదె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. మొదటి దశలో అద్దె భావనాలల్లో, శిథిలావస్థలో ఉన్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడానికి నివేదికలు అందించాలని రెవెన్యూ సెక్రటరీని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి నిర్మాణ పనులు వీలైనత త్వరితగతిన ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని చెప్పారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడం తోపాటు చాలా వరకు అ÷-దదె భవనాలలోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు.

# ఎపిలో నేటినుంచి బడిగంటలు

అమరావతి,జూన్11 ఆంధ్రప్రదేశ్‌లో బడిగంటకు వేళాయింది. దాదాపు రెండు నెలల విరామం తర్వాత స్కూళ్లు తెరుచుకోబోతున్నాయి. శుక్రవారం నుంచి స్కూళ్లు పున:ప్రారంభం అవుతున్నాయని విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు ఏడాది క్యాలెండర్‌ను విడుదల చేసింది. 229 పని దినాలు, 87 రోజులు సెలవు దినాలుగా ప్రకటించింది. పరీక్షల షెడ్యూల్‌ను సైతం విద్యాశాఖ విడుదల చేసింది. రెండు నెలల పాటు చిన్నారులు ఆటాపాటలతో ఎంజాయ్ చేశారు. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. ఇప్పుడు మళ్లీ బ్యాగ్‌లు భుజాన వేసుకుని.. పుస్తకాలతో కుస్తీ పట్టే సమయం దగ్గర పడింది. నేటితో వేసవి సెలవులు ముగియడంతో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ బడి బాట పట్టనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. విద్యాశాఖ రూపొందించిన షెడ్యూల్ ప్రకారం.. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 229 పని దినాలు ఉండగా, 87 రోజులు సెలవులు కేటాయించారు. విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు పాఠ్యాంశాల పూర్తి, పరీక్షల నిర్వహణకు అనుగుణంగా ఈ క్యాలెండర్‌ను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో దసరా, సంక్రాంతి, క్రిస్మస్ తదితర ప్రధాన పండుగల సందర్భంగా సెలవులను ప్రకటించారు. అలాగే ప్రభుత్వ సెలవులు, ఆదివారాలు కలిపి మొత్తం 87 రోజుల విరామం లభించనుంది. అర్ధవార్షిక పరీక్షల షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, సమయపాలన పాటించడం లక్ష్యంగా పరీక్షల తేదీలను ముందుగానే ప్రకటించినట్లు పేర్కొంది.

# పరాకాష్టకు బిజెపి నీచ రాజకీయాలు

హైదరాబాద్,జూన్11 దేశంలో బీజేపీ నీచ రాజకీయం పరాకాష్టకు చేరిందని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి అన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. గడిచిన 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం.. విలువలను వదిలేసి, తీవ్ర దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణెళి దీనికి తాజా ఉదాహరణ అని అన్నారు. ఈ అప్రజాస్వామిక చర్యలను దేశ ప్రజలు గమనిస్తూనే ఉన్నారని... బీజేపీ చేస్తున్న ఈ అన్యాయపు రాజకీయాలకు కాలమే సమాధానం చెబుతుందన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను అత్యంత అన్యాయంగా, నిబంధనలకు విరుద్ధంగా తిరస్కరించారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ఉన్న అసెంబ్లీ సంఖ్యాబలం ప్రకారం.. బీజేపీకి దక్కేది కేవలం రెండు రాజ్యసభ సీట్లు మాత్రమేనని.. కానీ.. ఎలాగైనా సరే కాంగ్రెస్‌కు దక్కాల్సిన రాజ్యసభ సీటును లాక్కోవాలనే కుట్రతోనే.. కావాలని మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో గెలవలేక, ఇలాంటి దొడ్డిదారి రాజకీయాలతో ప్రతిపక్షాలను అణచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు జగ్గారెడ్డి.

# సర్ ప్రక్రియపై ఎందుకంత భయం

## దొంగ ఓట్లు తొలగిస్తే భయపడాలా- విపక్షాల తీరుపై మండిపడ్డ బిజెపి నేత రామచంద్రరావు



సిద్దిపేట,జూన్11: సర్ ప్రక్రియపై బురదజల్లడమే పనిగా ప్రతిపక్షాలు పెట్టుకున్నామయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. ఎందుకంత భయమో చెప్పాలన్నారు. దొంగోట్లను తొలగించడం ఎన్నిక లసంఘం విధి అన్నారు. గతంలో ఎస్‌ఐఆర్ నిర్వహించినప్పుడు భాజపా మద్దతిచ్చిందని, ఇప్పుడు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు భాజపాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని రామచందర్‌రావు విమర్శించారు.

సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం మాత్‌పల్లిలో నిర్వహిస్తున్న భాజపా జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో రామచందర్‌రావు పాల్గొని మాట్లాడారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఎస్‌ఐఆర్ పక్రియ కొనసాగుతోందన్నారు.

ఓటు హక్కు ఉన్న ప్రాంతంలోనే ఓటు వినియోగించేందుకు వీలు కల్పించడమే ఎస్‌ఐఆర్ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రత్యామ్నా య రాజకీయ శక్తిగా ఎదుగుతుండటంతో ప్రజలు భాజపాను విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలను మోసం చేశాయని ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసమే ఎస్‌ఐఆర్ పక్రియను నిర్వహిస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. దీనిని రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని సూచించారు. ఎస్‌ఐఆర్ అమలులో ప్రభుత్వం పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అప్రమత్తంగా ఉండాలి

### ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు








ఐ ఎన్ బి టైమ్స్ మైలవరం జూన్ 11:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్ ) కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా వ్యవహరించాలని మైలవరం ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు పిలుపునిచ్చారు.

మైలవరంలో శ్రీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సులో ఆయన కూటమి శ్రేణులకు ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం నమోదు చేయబడిన ఓట్లను సుమారు 20 నుంచి 25 సంవత్సరాలకు ఒకసారి సమగ్రంగా, అత్యంత సూక్ష్మంగా పరిశీలించే ప్రక్రియనే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) అని వివరించారు. సాధారణంగా ప్రతి ఎన్నికల సమయంలో కొత్త ఓట్లను చేర్చడం, మరణించిన లేదా అర్హత కోల్పోయిన వారి ఓట్లను తొలగించడం జరుగుతుందని, అయితే ప్రస్తుతం చేపడుతున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రక్రియ అని తెలిపారు. 2002లో ఒకసారి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించారని, మళ్లీ 24 ఏళ్ల తర్వాత 2026లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 2002కు ముందు నమోదైన ఓట్లను మినహాయించి, 2002 తర్వాత నమోదైన అన్ని ఓట్లను ఎన్నికల సంఘం క్షుణ్ణంగా పరిశీలిస్తోందన్నారు. ఆ కాలంలో నమోదైన ఓటర్లు తమ వివరాలను ధ్రువీకరించుకొని, మ్యాపింగ్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. ఈ నెల 14వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు సర్వే నిర్వహించబడుతుందని తెలిపారు. సంబంధిత అధికారులు ఇంటింటికీ వచ్చి ఓటర్ల వివరాలను ధ్రువీకరిస్తారని, ఆ సమయంలో కుటుంబ సభ్యుల ఓట్లను నిర్ధారించి సర్వే పత్రాలపై సంతకాలు చేయాలని సూచించారు. కుటుంబ సభ్యులు ఎక్కడ ఉన్నప్పటికీ కుటుంబ పెద్ద ధ్రువీకరణ తప్పనిసరి అని వివరించారు. ఈ ప్రక్రియలో బూత్ లెవల్ ఆఫీసర్లు (బి.ఎల్.ఓలు)తో పాటు రాజకీయ పార్టీలు నియమించే బూత్ లెవల్ ఏజెంట్లు (బి.ఎల్.ఏలు) కూడా పాల్గొంటారని తెలిపారు. బి.ఎల్.ఓలను ఎన్నికల సంఘం నియమిస్తే, బి.ఎల్.ఏలను ఆయా రాజకీయ పార్టీలు నియమిస్తాయని చెప్పారు. మ్యాపింగ్ ప్రక్రియ అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకవేళ నిర్లక్ష్యంగా మ్యాపింగ్ చేయించుకోకుండా వదిలేస్తే, జూలై 14 తర్వాత ఓటు హక్కును తిరిగి పొందేందుకు సంక్లిష్టమైన ప్రక్రియను అనుసరించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇందుకోసం ఎన్నికల సంఘం గుర్తించిన 14 రకాల ధ్రువపత్రాల్లో ఒకదాన్ని సమర్పించి, నిర్ణీత సమయంలో మ్యాపింగ్ ఎందుకు జరగలేదో వివరణ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు

.రాబోయే ఎన్నికలపై ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రతి ఓటరు తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని, ఇంటింటా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పిలుపునిచ్చారు. సదస్సులో కూటమి నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులు, కూటమి శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## సిబిఎస్ఇ ఆన్ స్క్రీనింగ్ లోపాలు

### బయటపెట్టిన 19 ఏళ్ల కుర్రాడు- ఏకంగా కాన్పూర్ ఐఐటిలో జాబ్

కాన్పూర్,జూన్11 సీబీఎస్‌ఈ ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన పక్రియలో లోపాలపై దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ లోపాలను బయటపెట్టిన యువతలో 19 ఏళ్ల నిసర్గ అధికారి కూడా ఒకరు. తాజాగా అతడిని ఐఐటీ కాన్పూర్ నియమించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. తమ సైబర్ డిఫెన్స్ రీసెర్చ్ సెంటర్ నిసర్గ అధికారిని ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్, థ్రెట్ ఇంటెలిజెన్స్ ఇంజినీర్‌గా నియమిస్తున్నట్లు ఐఐటీ కాన్పూర్ వెల్లడించింది. దీనిపై ఈ విద్యాసంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ మహీంద్ర అగర్వాల్ మాట్లాడుతూ.. 'నిసర్గ అధికారి ఎంతో నైపుణ్యం ఉన్న యువ ఇంజినీర్. అతడికి చిన్న వయసులోనే అద్భుతమైన సాంకేతిక సామర్థ్యాలున్నాయి. ఈ నియామకంతో సైబర్ సెక్యూరిటీ రంగంలో అతడికి మరిన్ని అవకాశాలు లభిస్తాయి. ఆరోతరగతికి వచ్చాక.. సైబర్ సెక్యూరిటీపై దృష్టిపెట్టాడు. 'క్యాప్చర్ ది ఫ్లాగ్' వంటి హ్యాకింగ్ పోటీల్లో పాల్గొని పలు బహుమతులు గెలుచుకున్నాడు. ఇటీవల సీబీఎస్‌ఈలోని ఆన్ స్క్రీన్ మార్కింగ్ పోర్టల్‌లో లోపాలను గుర్తించిన నిసర్గ.. ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన సైబర్ సెక్యూరిటీ విభాగం సెర్ట్-ఇన్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో అతడి పేరు జాతీయ మీడియాలో మార్మోగింది. తాజా నియామకంపై నిసర్గ మాట్లాడుతూ.. 'ఫుల్‌టైమ్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో పనిచేయడం ఆనందంగా ఉంది. అయితే, వేతనం నేను అనుకున్న దానికంటే తక్కువగానే ఉందని పేర్కొన్నాడు.

## శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి

### చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు



మండలంలోని పాతసింగరాయకొండ గ్రామములో వేంచేసియున్న శ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం నందు తేదీ:24-06-2026 నుండి 04-07-2026 వరకు జరుగు శ్రీస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఉదయం దేవస్థాన కార్యాలయములో మండల స్థాయి అధికారులతో తహశీల్దారు రాజేష్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు, మాట్లాడుతూ పోలీస్ బందోబస్తు స్వామివారి భక్తులకు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా వారికి రాకపోకలు ఏర్పాటు చేయటం అదేవిధంగా సాంస్కృతి కార్యక్రమాలు మరియు రథోత్సవం కార్యక్రమానికి అధిక సంక్యలో భక్తులు పాల్గొంటారని కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని పోలీసు పాత్ర కీలకమని అన్నారు. వైద్య శాఖ అధికారులతో రెండు చోట్ల భక్తులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలు పూర్తయ్యేంతవరకు అంబులెన్స్ ను అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. విద్యుత్ శాఖ అధికారి బ్రహ్మోత్సవాలు పూర్తయ్యేంతవరకు స్వామివారి ఉత్సవాలకు విద్యుత్ ఆటకం కలగకుండా విద్యుత్ సరఫరా నిరంతరాయంగా వుండే విధంగా పలుసూచనలు తెలియజేశారు. భక్తులకు దర్శనం ఏర్పాట్లు మరియు వారికి త్రాగునీరు,బయో టాయిలెట్స్, తదితర సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం ఇతర శాఖల అధికారులతో పలు అంశాల గురించి చర్చించారు. జుశీ కృష్ణవేణి మాట్లాడుతూ స్వామివారి భక్తులకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలు అన్ని శాఖల అధికారులతో విజవంతంచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీహరి, వీణా జయమణి, వైద్య అధికారి డా వంశీధర్, ఎస్సై సుధీర్ కుమార్,విద్యుత్ అధికారి సాంబశివ రావు,ముఖ్య అర్చక ఉదయగిరి శేష లక్ష్మి నరసింహచార్యులు,పంచాయతీ కార్యదర్శి మాధవి,ఎ=ూ సింహాద్రి , రికార్డు అసిస్టెంట్ బాపట్ల బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ స్కీమ్‌కు 10 సంవత్సరాలు పూర్తి, దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ



ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 11

తెలంగాణ స్టేట్ సీనియర్ సిటిజన్స్ ఫెడరేషన్ అధ్యక్షులు పి. రామచంద్రయ్య ఆధ్వర్యంలో అన్నపూర్ణ స్కీమ్ ప్రారంభమై 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్ పల్లి మీూా మాధవరం కృష్ణారావు , మల్కాజ్గిరి పార్లమెంట్ దీ=ూ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. అలాగే బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దివ్యాంగులకు నెలకు సరిపడే నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, దివ్యాంగుల సంక్షేమం కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే రామచంద్రయ్య తో కలిసి త్వరలో మరింత పెద్ద స్థాయిలో సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాజా, మహిళా అధ్యక్షురాలు కవిత, సుజాత గౌడ్, పారిజాత, స్వాతి ముదిరాజ్, సీనియర్ నాయకులు దారం వెంకటేశం గుప్త,స్థానిక నాయకులు మహంకాళి సూర్యనారాయణ, జేరుపోతుల రవీందర్ రావు , ఎడ్ల ప్రభాకర్,దారం సతీష్ గుప్తా,దండు కుమార్,ముత్యాల మురళీధర్, మల్లారెడ్డి,నర్ర దేవేందర్ రెడ్డి, మొగుడంపల్లి కిరణ్ గుప్తా, కందుల రమేష్,సోషల్ మీడియా అధ్యక్షులు మొహమ్మద్ బాబా బాలానగర్ విద్యార్థి విభాగం అధ్యక్షులు సూర్య ప్రకాష్ కోరపాటి తదితరులు పాల్గొన్నారు.

అలాగే బాలానగర్ ప్రాంతానికి చెందిన దివ్యాంగులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తిన కూకట్పల్లి ఎమ్మెల్యే: మాధవరం కృష్ణారావు



ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 11గురువారం తెలంగాణ భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పై ధ్వజమెత్తారు.. ప్రధానం గా అధికారులు కూడా కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా మారి ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి నాయకులు ప్రయోజనాలకే ప్రాముఖ్యత ఇవ్వడం సోచినీయంగా ఉందని.. ప్రజల ఆగ్రహానికి గురి కావద్దని హితవుపలికారు.. బిఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన ఫ్లై ఓవర్లు ,అండర్పాస్ బ్రిడ్జి నిర్మాణాలు, నాలాల అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పార్టీ ఏర్పడి రెండున్నర సంవత్సరాలైనా కూడా ఒక్క అభివృద్ధి పని కూడా ముందుకు వెళ్లలేదని.. ఆనాడు చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపన చేయడం ఈ ప్రభుత్వానికే చెల్లిందని ఎద్దేవా చేశారు ..మూసీ నది ప్రక్షాళన అంటూ గత రెండున్నర ఏళ్ల నుంచి చెప్పడమే తప్ప కనీసం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని.. మహిళకు తులం బంగారం ఇస్తామని అబద్ధపు హామీలు చెప్పి ప్రభుత్వం లోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా కూడా ఒక్క హామీ నిలబెట్టుకోలేకపోవడం.. ప్రజల్లో ఆగ్రహానికి గురిచేస్తుందని.. రాబోయే రోజుల్లో ప్రజల చేత గట్టి బుద్ధి చెప్పించుకునే రోజు దగ్గరలోనే ఉందని మాధవరం కృష్ణారావు ఈ సందర్భంగా అన్నారు.. బిఆర్ఎస్ పార్టీలో ఉండి కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా మారి.. ధైర్యం లేక ఏ పార్టీలో ఉన్నామో కూడా చెప్పుకోలేని స్థితిలో కొంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారని ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలో రాజీనామాలు చేసి తిరిగి గెలవాలని.. దీనికి తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.. రాబోయే రోజుల్లో ఇటువంటి వారికి తగిన గుణపాఠం ప్రజలే చెబుతారని ఆయన తెలిపారు.

## కూకట్‌పల్లి నియోజకవర్గం, కేపీహెచ్‌బీ కాలనీ 117వ డివిజన్‌లో దండమూడి శోభనాద్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ




ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి, జూన్ 11గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ కాలనీ 117వ డివిజన్ మాజీ కార్పొరేటర్, కీర్తిశేషులు దండమూడి శోభనాద్రి జయంతి సందర్భంగా వారి మేనల్లుడు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఆయన అభిమానులు, స్థానిక నాయకులు , ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై శోభనాద్రి ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీ 117వ డివిజన్ అభివృద్ధికి ఆయన చేసిన విశేష సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడుతూ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మందలపు సాయిబాబు చౌదరి మాట్లాడుతూ, "దండమూడి శోభనాద్రి ప్రజల మనిషిగా, అభివృద్ధికి కట్టుబడి పనిచేసిన గొప్ప నాయకుడిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన లేకపోవడం ఈ ప్రాంతానికి తీరని లోటు" అని అన్నారు

.ఈ కార్యక్రమంలో దొప్పలపూడి రత్నాకర్, చిలుకూరి గోవిందరాజు, గంట భీమేశ్వరరావు చౌదరి, నవీన్, కాజా నవీన్, మందలపు త్రినాథ్, రాము తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం శోభనాద్రి సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

INB TIMES
తెలుగు దినపత్రిక Telugu Daily News Paper
శుక్రవారం 12- 06- 2026

# సింగ్ గీతం విజయం సాధించాలన్న చిరంజీవి

తెలుగు సినిమా పరిశ్రమకు సింగీతం శ్రీనివాసరావు భీష్మాచార్యుడని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. 94 ఏళ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు ప్రయోగాత్మకంగా తెరకెక్కించిన చిత్రం 'సింగ్ గీతం' . నాగ్ అశ్విన్ నిర్మాతగా వ్యవహరించారు. జూన్ 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు శుభాకాంక్షలు చెబుతూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. సింగీతం శ్రీనివాసరావు.. తెలుగు సినిమా పరిశ్రమకు ఆస్తి, ఒక నిధి. దర్శకుడిగా ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించడమే కాకుండా, ఎంతోమంది కళాకారులకు అవకాశాలు కల్పించి వారి జీవితాలకు మార్గదర్శకుడయ్యారు. అలాంటి మహోన్నత వ్యక్తి దర్శకత్వంలో



రూపొందిన 'సింగ్ గీతం' ఈనెల 12న విడుదల కానుంది. ఇది ఇండియన్ సినిమాలో మరొక మైలురాయిగా నిలవాలని, పెద్ద విజయం సాధించాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అలాగే ఇలాంటి పెద్దలను గౌరవిస్తూ, వారి అనుభవాన్ని కొత్తతరానికి అందించే ఆలోచనతో ఈ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత నాగ్ అశ్విన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. ఒకవైపు ఆనాటితరానికి ప్రతినిధిగా నిలిచిన సింగీతం మరోవైపు ఈతరం ఆలోచనలను ప్రతిబింబించే నాగ్ అశ్విన్.. వీరి కాంబో ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంది. అలాగే ఈ చిత్రానికి, నాకెంతో ఇష్టమైన దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించడం మరింత ఉత్సాహాన్ని కలగజేస్తుంది' అని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇందులోభాగమైన అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అయాన్, అహల్య, శాలిని ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'సింగ్‌గీతం'. ఇది ఓ గ్రామంలోని ప్రజలకు ఎదురైన వింత సమస్య చుట్టూ తిరిగే కథ. కొన్ని అనూహ్య పరిణామాల తర్వాత ఆ ఊరి వాసుల సాధారణ మాటలన్నీ పాటలుగా మారిపోతాయి. ఈ నేపథ్యంలో ఆ గ్రామస్థుల గందరగోళాన్ని.. తమ వింత పరిస్థితికి సమాధానం వెతికే ప్రయత్నాల్ని ఇందులో వినోదాత్మకంగా ఆవిష్కరించారు.

# ధురంధర్ బాగా నచ్చింది: పవన్ కళ్యాణ్

ఈ మధ్య కాలంలో ఇండస్ట్రీలో సూపర్ హిట్ అందుకున్న చిత్రం 'ధురంధర్'పై ఇప్పటికే సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా దీని ఫ్యాన్స్ లిస్ట్‌లో అగ్ర కథానాయకుడు పవన్ చేరారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన 'ధురంధర్', 'బారాముల్లా' చిత్రాల గురించి మాట్లాడారు. 'ధురంధర్' మొదటి భాగం తనకు నచ్చిందని పవన్ చెప్పారు. కథను చాలా ధైర్యంగా చూపించారని అన్నారు. దర్శకుడు ఇలాంటి గొప్ప కథను తెరకెక్కించిన విధానం ఆకట్టుకుందన్నారు. ముఖ్యంగా మేకింగ్ స్టైల్ బాగుందని ప్రశంసించారు. తాను బిజీగా ఉండడం వల్ల 'ధురంధర్ 2' చూడలేకపోయినట్లు వెల్లడించారు. ఇక తనకు హారర్ జానర్ సినిమాలంటే ఇష్టమని తెలిపిన పవన్ 'బారాముల్లా' గురించి ప్రస్తావించారు. 1980ల చివర్లో తాను షూటింగ్‌ల కోసం శ్రీనగర్ వెళ్లిన రోజులను గుర్తుచేసుకున్నారు. 'నాకు హారర్ సినిమాలు చూడడం అంటే ఆసక్తి. అవి మన మనసును కథలో పూర్తిగా లీనం చేస్తాయి. నాకు నిద్ర రానప్పుడు ఏదైనా హారర్ సినిమా చూస్తాను. కశ్మీర్ నేపథ్యంలో తెరకెక్కిన 'బారాముల్లా' నాకు



పాత జ్ఞాపకాలను గుర్తుచేసింది. నేను 1987-1989లో షూటింగ్‌ల కోసం కశ్మీర్ వెళ్తుండేవాడిని. అప్పుడే అక్కడ గందరగోళాన్ని స్వయంగా చూశాను. కశ్మీరీ పండిట్లు పడిన బాధలను గమనించాను. ఎవరైనా గెట్‌అవుట్.. ఇక్కడినుంచి వెళ్లిపోండి అంటే నాకు నచ్చదు. దాన్ని భరించడం చాలా కష్టం. బహుశా 'బారాముల్లా'లో ఉన్న ఆ భావోద్వేగమే నాకు సినిమా నచ్చేలా చేసిందేమో' అని చెప్పారు.

# ఇరుముడితో అదృష్టం వెతుక్కుంటున్న భవానీ శంకర్

న్యూస్ ప్రజెంటర్ నుండి హీరోయిన్‌గా ఛేంజైన చెన్నై పొన్ను ప్రియా భవానీ శంకర్ అనతికాలంలోనే యా÷-టకెస్గా ఐడెంటిటీని దక్కించుకుంది. సపోర్టింగ్ రోల్స్ చేసుకుంటూ.. సెల్ఫ్ మేడ్ హీరోయిన్‌గా మేకోవర్ అయ్యింది. కోలీవుడ్‌లో ప్రూవ్ చేసుకున్న ఈ బ్యూటీ.. టాలీవుడ్‌లో మాత్రం సక్సెస్ కోసం స్ట్రగుల్ ఫేస్ చేస్తోంది. తెలుగులో ఇప్పటి వరకు చేసిన త్రీ మూవీస్ ఫ్లాప్సే. సంతోష్ శోభన్ హీరోగా తెరకెక్కిన కళ్యాణం కమనీయంతో టాలీవుడ్ తెరంగేట్రం చేసింది ప్రియా భవానీ శంకర్. కానీ ఈ సినిమా వచ్చి పోయిన విషయం తెలియదు ఆడియన్స్‌కు. కానీ దూత వెబ్ సిరీతో చేరువైంది. ఇందులో నాగ చైతన్య భార్యగా కరెప్టెడ్ జర్నలిస్ట్‌గా నటించింది. ఈ సిరీస్.. గోపీచంద్‌తో భీమ, సత్య దేవ్ జీబ్రాలో నటించే తెచ్చిపెట్టింది కానీ, ఈరెండు బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడటంతో టీటౌన్‌లో అవకాశాలు తగ్గాయి. కోలీవుడ్ ఆఫర్స్‌తో కాలం నెట్టుకొస్తున్న




ప్రియాకు.. మరొక ఛాన్స్ ఇస్తోంది టాలీవుడ్ . శివ నిర్వాణ-రవితేజ కాంబోలో తెరకెక్కుతోన్న ఇరుముడిలో నటిస్తోంది. రవితేజకు భార్యగా కావేరి పాత్రలో కనిపించబోతుంది. ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఫిల్మ్. షూటింగ్ కంప్లీట్ కావడంతో సెట్స్‌లోని పిక్స్ సోషల్ మీడియాలో పంచుకుంది



# మీరే నా సర్వస్వం..సర్

భారతీరాజాను తలచకుంటూ రాధిక ఉద్వేగం

దిగ్గజ దర్శకుడు భారతీరాజా తో నటి రాధికకు విడదీయరాని అనుబంధం ఉంది. భారతీరాజాను తన గురువుగా భావించే రాధిక సందర్భం వచ్చినప్పుడల్లా ఆయనపై ఉన్న అభిమానాన్ని వెల్లడిస్తూనే ఉంటారు. ఆయన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నానంటూ తాజాగా వరుస పోస్ట్‌లు పెట్టారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకున్నారు. 'మీరే నా సర్వస్వం..' అని రాసుకొచ్చారు. ఆయన లేరని తెలిసి తన హృదయం ముక్కలైందన్నారు. నన్ను తీర్చిదిద్దిన వ్యక్తులు ఇద్దరు. నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం వాళ్లే. ఒకరు నా తల్లి, మరొకరు నా గురువు భారతీరాజా. ఒక్క ఏడాదిలోనే వీళ్లిద్దరినీ నేను కోల్పోయాను. ఈ వేదనను మాటల్లో వివరించలేకపోతున్నాను. ఏం చెప్పాలో కూడా అర్థం కావడం లేదు. హృదయం బరువెక్కింది. నా బాధను అర్థం చేసుకుని, నాతో పాటు నిలబడి, అండగా నిలిచిన ప్రతిఒక్కరికీ నేను తలవంచి నమస్కరిస్తున్నాను. వారి జ్ఞాపకాలు, వారు నాకు నేర్పిన జీవిత పాఠాలు నాతో ప్రయాణిస్తూనే ఉంటాయని రాసుకొచ్చారు. ఇక సినీ వేడుకల్లో భారతీరాజా అంటే తనకు ఎంత ఇష్టమో చెప్పిన వీడియోను ఆమె పంచుకున్నారు. 'భారతీరాజా సర్.. మీరే నా సర్వసం. మీ ఆత్మకు శాంతి చేకూరాలి' అని క్యాప్షన్ పెట్టారు. రాధికను ఇండస్ట్రీక్రి పరిచయం చేసింది భారతీరాజానే. 1977లో వచ్చిన తమిళ మూవీ '16 వయథినిలే'తో దర్శకుడిగా మారిన ఆయన తన రెండో సినిమా 'కిళక్కే పొగమ్ రైల్'తో రాధికను నటిగా కోలీవుడ్‌కు పరిచయం చేశారు. ఆ సినిమా హిట్ కావడంతో ఆమెకు వరుస అవకాశాలు వచ్చాయి. ఆమెను స్టార్ హీరోయిన్‌గా తీర్చిదిద్దిన గురువుగా భారతీరాజాపై రాధికకు అపారమైన గౌరవం ఉంది. ఆయన కూడా తన విజయాల్లో రాధిక భాగమని ఎప్పుడూ చెప్పేవారు. ఇటీవల కూడా రాధిక ఆయన్ని కలవగా.. ఆమె నటించిన 'తాయ్‌కిళవి'కి నేషనల్ అవార్డు వస్తుందని ప్రోత్సహించారు.




# బాలయ్య కొత్త చిత్రం.. ఎన్బీకె 111 టీజర్ గాడ్ ఆఫ్ మాసెస్..

ఈ ట్యాగ్ కి అర్హత ఉన్న ఏకైక టాలీవుడ్ నటుడు నందమూరి నటసింహం బాలకృష్ణ మాత్రమే. అసలు మాస్ అంటే బాలయ్య.. బాలయ్య అంటే మాస్. టాలీవుడ్ మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ బాలయ్య. దాదాపు మూడు దశాబ్దాల క్రితమే మాస్ సినిమా అంటే ఎలా ఉంటుందో.. ముద్దుల మావయ్యతో మాస్ హిట్ అందుకున్న బాలయ్య, లారీ డ్రైవర్ తో మాస్ కి పూనకాలు తెప్పించి సమరసింహారెడ్డితో ట్రెండ్ సెట్టర్ మారి గాడ్ ఆఫ్ మాస్ గా మారారు. అప్పటి నుంచి బాలయ్యలోని మాస్ హీరో ఆడియెన్స్‌ను అలరిస్తునే ఉన్నాడు. దర్శకులు బాలయ్య కోసం రాసుకున్న మాస్ కథలు ఎన్నెన్నో. అయితే కొందరు హీరోలకు మాస్ అంటే ఒక లిమిట్ ఉంటుంది. మాస్ సినిమాలు ఇక చాలు బాబు అనేలా ఉంటుంది. కానీ బాలయ్య విషయంలో అలా కాదు. ఇంతకంటే మాస్ ఏం చూపిస్తారులే అనుకునేలోపే.. మాస్ కా బాప్ లాంటి సినిమా చేయడం బాలయ్య స్టైల్. సింహా, లెజెండ్, అఖండ లాంటి సినిమాల్లో బాలయ్యలోని కొత్త మాస్ హీరోని చూపించాడు బోయపాటి. మరి ఇంతకంటే మాస్ ఇంకేం ఉంటుంది అనుకుంటే.. వీరసింహారెడ్డిలో బాలయ్య చేసిన మాస్ తాండవానికి థియేటర్లు దద్దరిల్లిపోయాయి. ఇక డాకు మహారాజ్ అయితే నెక్ట్స్ లెవల్ ఆఫ్ మాస్ మూవీ అని చెప్పడంలో ఎలాంటి డౌట్స్ అక్కర్లేదు. డేకేడ్ బెస్ట్ ఇంటర్వెల్ బ్యాంగ్ అంటే ఇప్పటికి దాకు మహారాజ్ అనే చెప్పాలి. ఇక బాలయ్య వింటేజ్ మాస్ మొత్తం చూపించారులే అనుకునే టైమ్ లో బాలయ్య మాస్ దాహం మాత్రం ఇప్పట్లో తీరేది కాదని సరికొత్త మాస్ ని పరిచయం చేసాడు దర్శకుడు గోపిచంద్ మలినేని. లేటెస్ట్‌గా వచ్చిన ఎన్బీకె 111 టీజర్ చూస్తే.. ఈ విషయం అర్థమవుతుంది. ఈసారి వింటేజ్ బాలయ్యను కాకుండా.. న్యూ ఏజ్ బాలయ్యను చూపించాడు. ఈ టీజర్ చూస్తే.. స్టైలిష్ లుక్‌తో బాలకృష్ణ మాస్‌ను 'జెన్-జీ' ట్రెండ్‌కు తగ్గట్టుగా ప్రెజెంట్ చేయబోతున్నాడు గోపీచంద్. దానికి తోడు.. బాలయ్య అంటే ఊగిపోయే తమన్, మరోసారి తన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో పూనకాలు తెప్పించాడు. ఏదేమైనా.. గాడ్ ఆఫ్ మాసెస్ అంటే ఆ మాత్రం ఉంటది మరి!